తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT









సంపుటి: 1 సంచిక: 95 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ సోమవారం 11 -11-2024 వెల: 5/రూ -


# నాపై కక్ష సాధించుకోండి

### ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అభివృద్ధిని అడ్డుకోకండి: సీఎం రేవంత్


### కురుమూర్తి స్వామిని దర్శించుకున్న ముఖ్యమంత్రి

### రూ.110 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన



మహబూబ్ నగర్: "ఉమ్మడి రాష్ట్రంలోనైనా, తెలంగాణలోనైనా వలసలకు మారుపేరు పాలమూరు జిల్లా. అలాంటి జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణం గత పాలకుల నిర్లక్ష్యమే. తెలంగాణ వచ్చి పదేళ్లయినా వలసలు కొనసాగుతున్నాయి. పాలమూరు జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తిచేసి పాడి పంటలతో విలసిల్లేలా మా ప్రభుత్వ నిర్ణయాలుంటాయి.."అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆదివారం ఆయన రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహలతో కలసి మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపురంలో కురుమూర్తి స్వామిని దర్శించుకున్నారు. అక్కడ రూ.110 కోట్ల వ్యయంతో చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్, ఘాట్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడారు. నారాయణపేట- మక్తల్ - కొడంగల్ ప్రాజెక్ట్ పూర్తి చేసి త్వరలోనే ఆయా నియోజకవర్గాలకు కృష్ణా జలాలు పారిస్తామని

(మిగతా 2వ పేజీలో)



# అహంకారం.. ఆర్భాటం వద్దు

### కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వారంతా పదవుల్ని బాధ్యతగా భావించాలి.

### అందరితో సౌమ్యంగా, గౌరవంగా మెలగండి

### ప్రజలతో మమేకమై బాధ్యతగా పనిచేయండి

### పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

### నామినేటెడ్ పదవులు పొందినవారికి సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి, నవంబరు 10 : 'కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టులు పొందిన వారంతా పదవుల్ని బాధ్యతగా భావించాలి. ఎక్కడా పదవీ అహంకారం, హడావుడి ఉండకూడదు. అందరితో సౌమ్యంగా, గౌరవంగా వ్యవహరించాలి. నిజాయితీగా, కష్టపడి పనిచేసి, పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలి. సింపుల్ గవర్నమెంట్.. ఎఫెక్టివ్ గవర్నెన్స్ అనే మన నినాదాన్ని గుర్తు పెట్టుకుని, ప్రజలతో మమేకం కావాలి' అని సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రెండో జాబితాలో నామినేటెడ్ పదవులు పొందిన వారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పోస్టుల ద్వారా మంచి అవకాశాలు పొందారు. మనది పొలిటికల్ గవర్నెన్స్ అనే విధానం అని చెప్పాం. అంటే ప్రజలకు చేసే మంచిలో మీరూ భాగస్వాములు కావడమే. తద్వారా మరింత కచ్చితత్వంతో, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ప్రజలకు సేవ చేసే అవకాశం ఏర్పడుతుంది. అందుకే మీకొచ్చిన పదవులను బాధ్యతగా భావించి, ప్రజల కోసం పని చేయాలి. పార్టీకి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురండి' అని సీఎం సూచించారు. 'కష్టపడిన వారికి న్యాయం చేయాలనే అంశం ప్రాతిపదికగా ముందుగా మిమ్మల్ని ఎంపిక చేశాం. పార్టీ కోసం మీ పోరాటం, కష్టం, త్యాగం, పనితీరు, విధేయత, క్రమశిక్షణ ఆధారంగా ఈ ఎంపికలు జరిగాయి. తీవ్ర ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి పదవులిచ్చాం. గత ప్రభుత్వ దాష్టీకాలను ఎదుర్కొని, ఐదేళ్లు ధైర్యంగా నిలబడినవారికి ప్రాధాన్యం ఇచ్చాం. ఎన్ని సవాళ్లు వచ్చినా నిలబడి పోరాటం చేసిన వారికి, మహిళలు, యువతకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాం. బూత్ స్థాయి కార్యకర్తలకు రాష్ట్రస్థాయి పదవులు ఇచ్చే ఏకైక పార్టీగా టీడీపీ నిలుస్తుంది. చాలామంది బూత్ ఇన్‌చార్జ్‌లు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, గ్రామ, వార్డు అధ్యక్షులకు రాష్ట్రస్థాయి పదవులిచ్చాం. రానున్న రోజుల్లోనూ మరిన్ని పదవులిస్తాం. గత ఐదేళ్లు పార్టీ కార్యక్రమాల నిర్వహణలో, పార్టీ సభ్యత్వ నమోదులో, పార్టీ నిర్దేశించిన ఇతర లక్ష్యాలను చేరుకున్న వారికి నామినేటెడ్ పదవులిచ్చాం. పార్టీ కోసం కష్టపడి పని చేస్తే ఎక్కడో మారుమూల గ్రామంలో ఉన్నవారికీ పదవి లభిస్తుందనేది నేటి ఈ పోస్టుల భర్తీ ద్వారా మరోసారి అందరికీ అర్థమైంది. రానున్న రోజుల్లో ఇంకా చాలామందికి ఆయా కార్పొరేషన్ డైరెక్టర్లుగా,

(మిగతా 2వ పేజీలో)

# కమీషన్ల కోసం రైతుల బలి



ధాన్యం సేకరణలో సర్కారు నిర్లక్ష్యం..

బోనస్ ఎగ్గొట్టేందుకు కొనుగోలు ఆలస్యం: సంజయ్

# గల్ఫ్ బాధితులకు లోకేశ్ అండ

కష్టాల్లో ఉన్నవారికి ఆపన్నహస్తం

ఏజెంట్ల చేతిలో మోసపోయిన 20 మంది తెలుగువారికి విముక్తి

స్వస్థలాలకు వచ్చేందుకు సాయం



# కర్ణాటకలో ముగ్గురు మంత్రులకు కాంగ్రెస్ నోటీసులు!



# బీసీలకు కాంగ్రెస్ ఒక్క హామీనీ నెరవేర్చలే



### 42 శాతం రిజర్వేషన్లు కల్పించాకే

### స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

### కులగణనను స్వాగతిస్తున్నాం

### సర్వేకొచ్చేవారిని హామీలపై నిలదీయాలి

### కాంగ్రెస్ ఏడాది వైఫల్యాలపై వారోత్సవాలు

### పొంగులేటిది బాంబుల మంత్రిత్వశాఖ: కేటీఆర్

హైదరాబాద్, నవంబరు 10 : బీసీలను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు బేషరుతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. ఏడాది కిందట కామారెడ్డి జిల్లా కేంద్రంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఓట్ల కోసం దొంగ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ఒక్క బీసీ డిక్లరేషన్ హామీ అయినా అమలు చేసిందా? అని ప్రశ్నించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కులగణన పూర్తయిన తరువాత, బీసీలకు 42% రిజర్వేషన్లు కల్పించాలని, ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. తాము కులగణనను సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని చెప్పారు. 42% రిజర్వేషన్లు అమలు చేయాలని ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణ రైతులకు పంటపై బోనస్ రూ.500లు ఇస్తున్నామని రేవంత్‌రెడ్డి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఏ ఒక్క రైతుకైనా రూ.500ల బోసన్ ప్రభుత్వం ఇచ్చినట్లు నిరూపిస్తే తాము రాజీనామాలకు సిద్ధమని సవాల్ చేశారు. ఒక్క బీసీకైనా వడ్డీ లేని రూ.10లక్షల రుణం ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఐదేళ్లలో బీసీల సంక్షేమం కోసం ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో లక్ష కోట్లు కేటాయిస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. తొలి ఏడాది బడ్జెట్‌లో కేవలం రూ.8వేల కోట్లే ప్రకటించిందని, అవికూడా ఇప్పటివరకు విడుదల చేయలేదని విమర్శించారు. సర్పంచులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని ఆందోళన చేస్తుంటే దుర్మార్గంగా అరెస్టులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. బీసీ వెల్ఫేర్‌తో పాటు ఎంబీసీలకు మరో మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, తన క్యాబినెట్‌లో 18మంది మంత్రులను

(మిగతా 2వ పేజీలో)

# అధికారులను బెదిరిస్తే సుమోటో కేసులు

## వారిపై ఈగ వాలినా బెదిరించిన వారే బాధ్యులు

### ఐపీఎస్‌లు లక్ష్యంగా గత ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు తప్పు.. సుమోటోగా చర్యలు

### ఏ ఆడబిడ్డకు ఇబ్బంది కలిగినా ఊరుకోను.. నేరగాళ్లకు కులమతాలు ఉండవు

### సింగపూర్ తరహా శిక్షలు అమలు చేయాలి.. గతంలో సీఎం పర్యటనల పేరిట చెట్లు నరికారు

### అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో డిప్యూటీ సీఎం పవన్ హెచ్చరిక



అమరావతి, నవంబరు 10 : విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారులను బెదిరిస్తే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోబోదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హెచ్చరించారు. అధికారులకు ఇంకోసా రి హెచ్చరికలు వంటివి చేస్తే సుమోటోగా చర్యలు తీసుకుని, కేసులు పెడతామన్నారు. అధికారులపై ఈగ వాలినా, చిన్న గీత పడినా బెదిరింపులకు దిగిన వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. రిటైర్ అయినా, సప్త సముద్రాలు దాటినా ఐపీఎస్ అధికారులే లక్ష్యంగా గత ముఖ్యమంత్రి చేస్తున్న వ్యాఖ్యలను

(మిగతా 2వ పేజీలో)

# నయా పెట్టుబడిదారుల నుంచి జార్ఖండ్‌ను రక్షించాలి



### ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

### జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో భట్టి విక్రమార్క

హైదరాబాద్: అదానీ, అంబానీ లాంటి నయా పెట్టుబడిదారుల నుంచి జార్ఖండ్ రాష్ట్రానికి విముక్తి కల్పించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జార?ండ్‌లో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాని ఆయన ప్రజలను కోరారు. ఆదివారం భట్టి జార్ఖండ్‌లోని రాంఘర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి సమావేశం, చిత్తార్పూర్ బహిరంగ సభలో పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

# కమీషన్ల కోసం రైతుల బలి

(మొదటి పేజీ తరువాయి)

శంకరపట్నం/భీమదేవరపల్లి, నవంబరు 10 : బ్రోకర్ల నుంచి కమీషన్లు దండుకునేందుకు రైతుల ప్రయోజనాలను రాష్ట్ర ప్రభుత్వం బలి చేస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. బోనస్ పైసలివ్వకుండా తప్పించుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాలను నేటికీ పూర్తిగా ప్రారంభించకపోవడం దారుణమన్నారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంజయ్ ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రం వడ్లకు క్వింటాకు రూ.2,300కు పైగా చెలిస్తోందని.. దీనికి రూ.500 బోనస్ చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. ఈ సీజన్‌లో 50 లక్షల టన్నుల సన్న వడ్లకు రూ.500 చొప్పున రూ.2,500 కోట్ల బోనస్ చెల్లిస్తామని ప్రగల్భాలు పలికిందన్నారు. ఇప్పటి వరకు రైతులకు నయా పైసా బోనస్ ఇవ్వలేదని మండిపడ్డారు. బోనస్ సంగతి దేవుడెరుగు..? కొనుగోళ్లు లేక విసిగిపోయిన రైతన్నలు ఇప్పటికే 20 లక్షల టన్నుల వడ్లను మిల్లర్లకు అమ్ముకున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చిన తర్వాత కాంగ్రెస్ సర్కారు విజయోత్సవాలు జరుపుకోవాలని చెప్పారు. రాష్ట్రంలోని ఆలయాలపై వరుస దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. దేవాలయాలపై దాడులు చేస్తున్న వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**రాకేశ్‌కు వైద్య ఖర్చులు అందిస్తా..**

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లికి చెందిన వికలాంగ విద్యార్థి



గూళ్ల రాకేశ్ వైద్యానికి అయ్యే ఖర్చులను భరిస్తానని బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఆదివారం రంగయ్యపల్లిలో రాకేశ్‌ను కలిసి మాట్లాడారు. అతడికి త్రిచక్ర వాహనాన్ని అందిస్తానని చెప్పారు. అలాగే గ్రామంలో ఇటీవల పిడుగుపడి పెద్ద మొత్తంలో ఆస్తిం నష్టం జరిగిన ఓ కుటుంబాన్ని సంజయ్ పరామర్శించారు.

# అధికారులను బెదిరిస్తే సుమోటో కేసులు

(మొదటి పేజీ తరువాయి)

సుమోటోగా స్వీకరిస్తామని జగన్‌ను ఉద్దేశించి అన్నారు. ఆదివారం గుంటూరులోని అరణ్యభవన్‌లో జరిగిన రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించి, అటవీ అమర వీరుల కుటుంబసభ్యులను సన్మానించారు. పవన్ ప్రసంగిస్తూ... "తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు సప్త సముద్రాల ఆవ ల ఉన్నా వదలమని గత ముఖ్యమంత్రి అంటున్నారు. విధి నిర్వహణలో ఉన్న అధికారులను బెదిరిస్తే ఊరుకునేది లేదు. కర్తవ్య నిర్వహణలో ఉన్న అధికారులు ఎవరూ బెదిరింపులకు బెదిరిపోరు. 20 ఏళ్లు తమ ప్రభుత్వం ఉంటుందని మభ్య పెట్టి గత ప్రభుత్వంలో పోలీసు అధికారులతో తప్పిదాలు చేయించారు. రోడ్డు మీద నిరసనను చూస్తున్న మహిళలపై కూడా హత్యాయత్నం కేసులు పెట్టారు. మేం ప్రతిపక్షంలో ఉన్నప్పు డు పోలీసులు ఎన్నిసార్లు ఇబ్బంది పెట్టినా బాధ్యతగా వ్యవహరించమని కోరామే తప్ప.. ఏనాడూ అంతు చూస్తామని మాట్లాడలేదు. ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తి, శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి అధికారులను బెదిరిస్తూ వ్యాఖ్యలు చేయడం తప్పు. మీరు ఇంట్లో కూర్చుని రోడ్డు మీద ఆడబిడ్డల సంరక్షణ లేదని విమర్శలు చేస్తున్నారు. ఆడబిడ్డలపై దాడులు ఎప్పు డు మొదలయ్యాయి? రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఉన్మాదులు ఎందుకిలా పేట్రేగిపోతున్నారు? గత ప్రభుత్వంలో పాలకులు బాధ్యతా రాహిత్యంగా నోటికి వచ్చిందల్లా మాట్లాడేశారు. నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత సీఎం సతీమణిని తిట్టారు. ఇళ్లల్లోకి వచ్చి బిడ్డలను రేప్ చేస్తామని మాట్లాడారు. పాలించే నాయకులే ఇష్టారాజ్యంగా మాట్లాడితే.. క్రిమినల్స్‌కు తప్పు లు చేసినా పర్వాలేదన్న ధైర్యం వస్తుంది. సామాజిక మార్పుతోనే ఆడబిడ్డలపై అఘాయిత్యాలు ఆగుతాయి. నా కళ్ల ముందు ఏ ఆడబిడ్డకి ఇబ్బంది కలిగినా చూస్తూ ఊరుకోను. పోలీసులు కూడా ఫిర్యాదు చేసిన వారిని క్రిమినల్స్ గా చూడొద్దు. నేరం మీద ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు ఇబ్బంది పెడతారన్న ఆలోచన రాకూడదు. నేరగాళ్లకు కులమతాలు ఉండవు. ఎన్ని చట్టాలు తెచ్చి నా వాటిని అమలు చేసే వ్యక్తుల్లో చిత్తశుద్ధి లేకపోతే ఫలితం ఉండదు. నిర్భయ కేసు తర్వాత కూడా అలాం టి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. సింగపూర్ తరహా శిక్షలు అమలు చేయాలి. సంఘ విద్రోహ చర్యల కు పాల్పడి కులాల వెనుక దాక్కుంటామంటే కుదరదు. ఏ కులం అయినా, మతం అయినా తప్పు చేస్తే



శిక్షించి తీరాలని ముఖ్యమంత్రి, డీజీపీకి చెప్పాం. ఆడబిడ్డల సంరక్షణకు ముందుగా చుట్టుపక్కన వారి పర్యవేక్షణ ఉండాలి. పూంచ్ సెక్టార్ మాదిరి విలేజ్ డిఫెన్స్ సిస్టం ఉండాలి. ప్రాంతాల వారీగా యువత, పెద్దల కలయిక తో డిఫెన్స్ కమిటీలు ఏర్పాటు కావాలి. విద్యాలయాల్లో నిరంతరం స్వీయ రక్షణ శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలి. డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం" అని పవన్ అన్నారు.

**చెట్ల నరికివేతపై వాల్టా చట్ట ప్రకారం చర్యలు**

గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి పర్యటనల పేరుతో రోడ్ల పక్కన చెట్లను ఇష్టారాజ్యంగా నరికేశారని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీశాయని, ఈ వ్యవహారంలో వాల్టా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. చెట్ల నరికివేతపై చర్యలు మొదలు పెడితే వైసీపీలో చాలామంది నాయకులు ఊచలు లెక్కపెట్టాల్సి ఉంటుందన్నారు. అటవీ సంపదను దోచుకునే స్మగ్లర్లు, అరాచక మూకలకు ఎదురొడ్డి ప్రాణాలర్పించిన అటవీ అమర వీరుల త్యాగాలను వృథా కానివ్వమని చెప్పా రు. అటవీ రక్షణలో ఒక ఐఎఫ్ఎస్ అధికారితో పాటు 23 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.

# నయా పెట్టుబడిదారుల నుంచి జార్ఖండ్‌ను రక్షించాలి

ఈ కార్యక్రమాల్లో మాట్లాడుతూ, కొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లో రాష్ట్రాన్ని పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని, చైతన్యంగల కాంగ్రెస్ కార్యకర్తలు జార?ండ్ రాష్ట్రాన్ని, వనరులను దోపిడీదారుల నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు.

భారత్ జోడో యాత్రలో భాగంగా దేశంలో విద్వేషం ఉండకూడదని, సంపద అందరికీ సమానంగా పంచాలని రాహుల్ గాంధీ ఇచ్చిన సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని కోరారు. అన్ని స్థాయిల్లో కాంగ్రెస్ పార్టీ నేతలు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించాలని, ఇండియా కూటమి హామీలను, మేనిఫెస్టోను పెద్ద ఎత్తున ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో ఏఐసీసీ నేతలు గులాం అహ్మద్‌మీర్, సిరివెళ్ల ప్రసాద్, జార?ండ్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశవ్ కమలేశ్ మహతో, మైనార్టీ సెల్ అధ్యక్షుడు తారిఖ్ అన్వర్‌లతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# చిట్టీల పేరిట జెన్‌కో ఉద్యోగి చీటింగ్

**రూ.93.18లక్షలు ఎగవేత**

**నాలుగో తరగతి ఉద్యోగుల నుంచి ఎస్ఈ వరకు బాధితులే**

(మొదటి పేజీ తరువాయి)

నాగార్జునసాగర్, నవంబరు 10 : తమ పిల్లల భవిష్యత్తు కోసం, ఉన్నత చదువులు, పెళ్లిళ్లు, ఇతర కుటుంబ అవసరాల కోసం డబ్బులు దాచుకోవాలని వారంతా చిట్టీలు వేశారు. నెలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును ఉద్యోగులందరూ కలిసి తోటి ఉద్యోగికి నమ్మకంతో ఇచ్చారు. చిట్టీ కట్టిన ఉద్యోగులకు సదరు వ్యక్తి తన భార్య పేరిట కోర్టు ద్వారా ఐపీ నోటీసులు(దివాలా దరఖాస్తు) పంపించడంతో పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.... నాగార్జునసాగర్ పైలాన్ కాలనీలో జెన్‌కో కార్యాలయ ఆర్టిజన్ తుర్క శ్రీనివాస్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో ఫైర్ అండ్ సేఫ్టీ విభాగంలో విధులు నిర్వహిస్తున్నాడు. 2017లో అడవిదేవుపల్లిలోని టెయిల్‌పాండ్ జలవిద్యుత్ కేంద్రం నుంచి సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి బదిలీపై వచ్చాడు. టెయిల్‌పాండ్ వద్ద పనిచేసిన సమయంలోనూ స్థానికంగా చిట్టీలు నిర్వహించాడు.

# సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా నేడు బాధ్యతలు

**ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం**

**51వ సీజేఐగా జస్టిస్ ఖన్నా నేడు బాధ్యతల స్వీకరణ**



న్యూఢిల్లీ, నవంబరు 10: సుప్రీంకోర్టు 51వ సీజేగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు. ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి భవన్‌లో ఆయనతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. 1960 మే 14న జన్మించిన ఆయన ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయవాద విద్యను అభ్యసించారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆయన ఆర్టికల్ 370 రద్దుకు సమర్థన, ఎన్నికల బాండ్ల పథకం రద్దు, ఈవీఎంలపై పిటిషన్ కొట్టివేత , ఢిల్లీ మాజీ సీఎం అరవింద్‌కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు సహా అనేక చారిత్రక తీర్పులిచ్చిన ధర్మాసనాలలో భాగంగా ఉన్నారు. ఇప్పటి వరకు సీజేఐగా ఉన్న జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టులో అంత్యత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఖన్నా ఆ బాధ్యతలు చేపట్టనున్నారు.

# నాపై కక్ష సాధించుకోండి

సీఎం రేవంత్ చెప్పారు. ఆరేడు దశాబ్దాలుగా వెనుకబడ్డ ఈ ప్రాంతంలో వలసలు ఆపాలని తాను చేస్తున్న అపర భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకునేందుకు కొందరు ఆరోపణలతో, చిల్లర మల్లర రాజకీయాలు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తనపై కోపం ఉంటే రాజకీయంగా కక్ష సాధించుకోవాలని.. అంతేతప్ప ప్రాజెక్టులను, జిల్లా అభివృద్ధిని అడ్డుకోవద్దని పేర్కొన్నారు. అలా చేస్తే చరిత్రహీనులుగా మిగిలిపోక తప్పదని వ్యాఖ్యానించారు. కాళ్లలో కట్టెలు పెట్టి, కుట్రలు చేసి ఎవరైనా అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే పాలమూరు బిడ్డలు క్షమించబోరని హెచ్చరించారు.

**అన్ని గ్రామాలకు బీటీ రోడ్లు..**

పాలమూరు జిల్లాలోని అమర్ రాజా బ్యాటరీస్ కంపెనీలో రెండు వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి అంగీకరించారని సీఎం రేవంత్ చెప్పారు. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా ఇక్కడి నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తమదని తెలిపారు. జిల్లాలో అన్ని గ్రామాలు, తండాలకు బీటీ రోడ్లు వేస్తామన్నారు. ఈ మేరకు అంచనాలు రూపొందించాలని ఉమ్మడి జిల్లా పరిధిలోని కలెక్టర్లను ఆదేశిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యేలు జీఎమ్మార్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

**మాకు అవకాశం వచ్చింది.. అభివృద్ధి చేసుకోవద్దా..?**

నాడు పాలమూరు జిల్లా ప్రజలు పార్లమెంట్‌కు పంపినా, రాష్ట్రానికి రెండు సార్లు సీఎం అయినా ఈ జిల్లాను పట్టించుకోలేదని మాజీ సీఎం కేసీఆర్‌ను ఉద్దేశించి రేవంత్ విమర్శలు గుప్పించారు. "మీ ప్రాంతానికి నిధులు తీసుకెళ్లినా, మీ నియోజకవర్గాలను అభివృద్ధి చేసుకున్నా మేం ఏనాడూ ఏడవలేదు. ఈ రోజు మాకు అవకాశం వచ్చింది. ఈ జిల్లా ప్రజలు 12 మంది ఎమ్మెల్యేలు, ఒక పార్లమెంట్ సభ్యుడిని ఇచ్చారు. సీఎంగా కూడా అవకాశం ఇచ్చారు.. ఈ జిల్లాను అభివృద్ధి చేసుకునే బాధ్యత మాకు లేదా.. నేను ఎక్కడికి వెళ్లినా, ఏ పనిచేస్తున్నా నిరంతరం పాలమూరు జిల్లాను అభివృద్ధి చేయాలన్నదే నా ఆకాంక్ష"అని పేర్కొన్నారు.

# అహంకారం.. ఆర్భాటం వద్దు

ఇతర పదవులిస్తాం. పదవులు వచ్చిన నాయకులు, యువత రెండేళ్ల పదవీ కాలాన్ని సమర్థంగా ఉపయోగించుకుని, ప్రజల కోసం నిజాయితీగా, కష్టపడి పని చేయడం ద్వారా రానున్న రోజుల్లో రాజకీయంగా మరింత ఎదగడానికి ఆస్కారం ఏర్పడుతుంది' అని సీఎం పేర్కొన్నారు. కాగా నామినేటెడ్ పదవుల మొదటి జాబితాలో 20 చైర్మన్ పోస్టులు, ఒక వైస్ చైర్మన్ పోస్టు భర్తీ చేసిన చంద్రబాబు.. 30వేల దరఖాస్తులను స్వయంగా పరిశీలించిన తర్వాత రెండో జాబితాలో ఏకంగా 60 మందికి చైర్మన్ పదవులు, ఇద్దరి కేబినెట్ హోదాతో సలహాదారు పోస్టులు ఇచ్చారు.

# కర్ణాటకలో ముగ్గురు మంత్రులకు కాంగ్రెస్ నోటీసులు!

బెంగళూరు, నవంబరు 10 : రాష్ట్రంలో మంత్రులపై వరుస వివాదాలు, అవినీతి ఆరోపణలు వస్తుండడంపై కాంగ్రెస్ అధిష్ఠానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముగ్గురు మంత్రులకు నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూములు.. వక్ఫ్ బోర్డుకు చెందినవంటూ నోటీసులు ఇవ్వడం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. దీనిపై బీజేపీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడం, విజయపురలో నిరవధిక నిరసనకు దిగడంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. వక్ఫ్ వివాదానికి మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ కారణమని బీజేపీ మండిపడుతోంది. ఇక అబ్కారీ శాఖలో ఏటా రూ.వందల కోట్లు లంచాలు అధికారుల ద్వారానే వసూలు చేయిస్తున్నట్టు మంత్రి ఆర్‌బీ తిమ్మాపురపై వారం రోజులుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిమ్మాపురకు నోటీసులు అందినట్టు సమాచారం. ఇక బెళగావి జిల్లా తహసీల్దార్ కార్యాలయంలోనే రుద్రణ్ణ యడణ్ణవర్ ఆత్మహత్య చేసుకున్న కేసులో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ పీఏ సోమును కీలక నిందితుడిగా పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదవడంతో అతను పరారీలో ఉన్నాడు. ఈ ముగ్గురు మంత్రులపై ఆరోపణలు రావడంపై అధిష్టానం తీవ్రంగా పరిగణించింది.

# గల్ఫ్ బాధితులకు లోకేశ్ అండ

**కష్టాల్లో ఉన్నవారికి ఆపన్నహస్తం**

**ఏజెంట్ల చేతిలో మోసపోయిన 20 మంది తెలుగువారికి విముక్తి**

**స్వస్థలాలకు వచ్చేందుకు సాయం**



పొట్ట కూటి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లిన ఎందరో తెలుగువాళ్లు మోసపోతున్నారు. అక్కడ కష్టాల్లో కూరుకుపోతున్నారు. ఇలాంటి బాధితులను ఆదుకునేందుకు మంత్రి నారా లోకేశ్ ఆపన్న హస్త అందిస్తున్నారు. వారి చీకటి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సాయం చేస్తున్నారు. తన దృష్టికి వస్తున్న సమస్యలపై వెంటనే స్పందిస్తున్నారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా మోసపోయి గల్ఫ్‌లో చిక్కుకున్న దాదాపు 20 మందిని స్వస్థలాలకు రప్పించారు. తాము ఇబ్బందుల్లో ఉన్నామని వాట్సాప్, ఎక్స్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా మెసేజ్‌లు పంపిన వారికి అండగా నిలిచారు. ప్రభుత్వ పరంగానే కాక టీడీపీకి అనుబంధంగా పని చేసే ఎన్నారై టీడీపీ బృందాలను రంగంలోకి దించి కష్టాల నుంచి గట్టెక్కించారు. ఇలా లోకేశ్ నుంచి సాయం పొందిన బాధితులు.. ముగిసి పోయిందనుకున్న తమ జీవితాల్లో ఆయన వెలుగులు నింపారని అంటున్నారు.

# బీసీలకు కాంగ్రెస్ ఒక్క హామీనీ నెరవేర్చలే

భర్తీ చేసుకునే చేతకాని సీఎం రేవంత్‌రెడ్డి అని, కొత్త మంత్రిత్వశాఖను ఏర్పాటు చేస్తా.. అంటే ఎవరు న మ్ముతారని ప్రశ్నించారు. దళిత బంధు నిధులు ఇవ్వాలని అడిగితే ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడులు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, అబద్ధాల సీఎంను బీఆర్ఎస్ తరుపున నిలదీస్తూనే ఉంటామన్నారు. ప్రభుత్వం ఏం సాధించిందని విజయోత్సవాలకు ఏర్పాటు చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలపైన తాము కూడా వారోత్సావాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి బాంబుల శాఖ ఇచ్చారేమో.. ఆయన రోజుకో బాంబు పేల్చుతానంటున్నారని, ఆ బాంబు కాంగ్రెస్ మంత్రుల్లో ఎవరిపైన పేలుతుందో అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

# ఓ ప్రైవేట్ పాఠశాల నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి


పూర్తి స్థాయిలో పోలీసులు విచారణ చేపట్టాలని నిపుణులు కోరుతున్నారు.

గతంలోనూ ఆర్టీసీ బస్సు కింద పడ్డ పాఠశాల విద్యార్థి.

చికిత్స పొందుతూ యువతీ మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొనడంపై పలు అనుమానాలు






**ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో:** ఇటీవలే నిర్మల్ జిల్లా కేంద్రంలో ఉన్న గ్రిల్ 9 రెస్టారెంట్ లో భోజనం చేసిన దాదాపు 20 మంది అస్వస్థకు గురవ్వగా బోథ్ కు చెందిన ఓ ప్రైవేట్ పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న యువతి ఫుడ్ పాయిజన్ కారణంగా మృతి చెందిన విషయం తెలిసిందే.రెస్టారెంట్లో భోజనం తిన్నవారికి ఫుడ్ పాయిజన్ అయిన విషయం వాస్తవమే కానీ ఫుడ్ పాయిజన్ ద్వారా మరణించిన యువతి విషయం వేరేలా ఉంది. వివరాల్లోకి వెళితే అదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలో ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాల సిబ్బంది ఈనెల రెండవ తేదీన నిర్మల్ కు షాపింగ్ నిమిత్తం వెళ్లి అక్కడే ఉన్న గ్రిల్ 9 రెస్టారెంట్ లో భోజనం చేసి తిరుగు ప్రయాణం అయ్యారు. అదే రోజు రాత్రి నుంచి సిబ్బందికి తీవ్రమైన వాంతులు విరేచనాలు కావడంతో మరుసటి రోజు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు చేయించుకోగా వైద్యులు ఫుడ్ పాయిజన్ అయ్యిందని నిర్ధారించారు. ఇదిలా ఉండగా సిబ్బందితోపాటు పాఠశాలలో వంట మనిషిగా పనిచేస్తున్న ఫుల్ కాళీ బైగా ను వాంతులు విరోచనాలు ఉండగా కూడా పాఠశాలలోని క్వార్టర్స్ లోనే ఉంచి కేవలం నలుగురు ఉపాధ్యాయ సిబ్బంది మాత్రమే చికిత్సలు చేయించుకున్నారనీ విశ్వసనీయ సమాచారం. నామమాత్రముగా వంట మనిషి పేరు ఆసుపత్రి రికార్డులో పేరు నమోదు చేసి మందులు తీసుకు వెళ్లినట్లు ఆస్పత్రి ఇన్ పేషెంట్ వార్డులో పనిచేస్తున్నవారు తెలిపారు. ఇక్కడ మరో విషయం ఏమిటంటే పాఠశాల ప్రిన్సిపల్ యువతి మృతికి గల కారణం హోటల్ రెస్టారెంట్ యాజమాన్యమేనని ఫుడ్ పాయిజన్ కారణంగానే మరణించిందని పిటిషన్ లో పేర్కొంటూ సదరు యువతిని మూడవ తేదీ నుండి చికిత్సలు చేస్తున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స జరుగుతుండగా ఆసుపత్రిలో మరణించినట్లుగా పిటిషన్ ను పోలీసులకు ఇచ్చారు.కానీ ఆస్పత్రి వైద్యుల వివరాల మేరకు అసలు వంటమనిషిని చికిత్సలకు ఆసుపత్రికి తీసుకురాలేదని ఐదవ తారీకు రోజున కూడా మరణించిన తర్వాతనే ఆసుపత్రికి తీసుకురావడం జరిగిందని. అట్టి వివరాలను కూడా సమయంతో సహా ఆసుపత్రి రికార్డుల్లో ఆసుపత్రి సిబ్బంది నమోదు చేశారు.కానీ పాఠశాల సిబ్బంది వైద్యులను, పోలీసులను తప్పుదోవ పట్టించేలా చికిత్స చేయించుకుంటూ మృతి జరిగిందని పిటిషన్ ఇవ్వడం వెనుక కారణాలు ఏంటని నిజా నిజాలు సంబంధిత పోలీసు శాఖ సిబ్బంది పూర్తి దర్యాప్తు చేయవలసిందిగా పలువురు నిపుణులు కోరుతున్నారు.మరోపక్క ఇదే ప్రైవేట్ పాఠశాలకు చెందిన నేరడిగొండ మండలానికి చెందిన ఓ విద్యార్థి గతంలో పాఠశాల సమయం అయ్యాక పొచ్చెర క్రాస్ రోడ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కుతుండగా బస్సు చక్రాల కింద పడి తీవ్రమైన గాయాల పాలయ్యాడు. ఈ విషయం బయటకు పోక్కకుండా విద్యార్థికి చికిత్స నిమిత్తం సహాయం చేసి చేతులు దులుపుకున్నారు. కానీ గతంలో విద్యార్థి ఆర్టీసీ బస్సు కింద పడడం, ఇటీవలే పాఠశాలలో పనిచేస్తున్న వంటమనిషికి అసలు వైద్య చికిత్సలు చేయించక సదరు పాఠశాల సిబ్బంది నిండు నిర్లక్ష్యంతో యువతి ప్రాణాలు పోయాయని ఆ పాఠశాల పోషకులు కూడా పాఠశాల పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యా బుద్ధులు నేర్పాల్సిన పాఠశాల సిబ్బంది ఓ సినిమా యాంగిల్ స్టోరీని అల్లడం ఏంటని ఆ పాఠశాలలో చదివిస్తున్న పిల్లల పోషకులు ఆగ్రహం వ్యక్తం చేస్తు, భవిష్యత్తులో తమ పిల్లల పరిస్థితి ఏంటంటూ సిబ్బందిని నిలదీస్తున్నట్లు సమాచారం. ఏదేమైనాప్పటికీ పాఠశాల సిబ్బంది నిండు నిర్లక్ష్యంతో యువతికి చికిత్స చేయించకుండా ఓ పేదింటి యువతిని బలిగోన్నారని. వాస్తవానికి చికిత్స అంది ఉంటే పాఠశాల బోధనా సిబ్బంది తీరే వంట మనిషి కూడా బ్రతికుండేదని ఎవరు అనుకుంటున్నారు. ఇప్పటికైనా ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన పాఠశాల ప్రిన్సిపల్ ఇచ్చిన పిటిషన్ ను పూర్తిస్థాయిలో పోలీసు శాఖ వారు దర్యాప్తు చేసి పాఠశాలపై తగు చర్యలు తీసుకోవాలని, మృతిచెందిన యువతి కుటుంబాన్ని పాఠశాల యాజమాన్యమే ఆదుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

### కేసును నిర్మల్ కు బదిలీ చేస్తున్నాం: బోథ్ ఎస్సై ప్రవీణ్

ఇటీవలే నిర్మల్ జిల్లా గ్రిల్ 9 రెస్టారెంట్ లో భోజనం తిన్న పలువురికి ఫుడ్ పాయిజన్ అయిన విషయం వాస్తవమే కానీ యువతికి సంబధిత సదరు పాఠశాల సిబ్బంది చికిత్స చేయించారా లేదా అన్న విషయం మా దృష్టికి రాలేదు పాఠశాల సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము.



## సింగాపురం మరకత ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్

**శంకర్‌పల్లి: నవంబర్ 10: (డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి లోని సింగాపురం పదవ వార్డులో గల మరకత కార్యసిద్ధి పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో రెండో వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి అశోక్ కుమార్ కుటుంబ సమేతంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ పట్టణ, వార్డు ప్రజలు స్వామివారి దీవెనలతో, ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని కౌన్సిలర్ కోరుకున్నారు. స్థానిక కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి విట్టలయ్య, మాజీ సర్పంచ్లు మాణిక్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

## బిజెపి హిందూ మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకుని రాజకీయం చేస్తుంది

**ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పార్టీ విఫలమయ్యింది**

సంగారెడ్డి బ్యూరో నవంబర్ 10(డైలీ రిపోర్ట్): భారతీయ జనతా పార్టీ దేశంలో హిందూ మతోన్మాదాన్ని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేస్తుందని, అయోధ్యలో జరిగిన ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూసిన బిజెపి అభ్యర్థిని ప్రజలు తిరస్కరించాలని సిపిఎం పార్టీ ఏరియా కార్యదర్శి ఎం యాదగిరి విమర్శించారు . ఆదివారం నాడు సంగారెడ్డి ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక సుందరయ్య భవన్లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ సంగారెడ్డి ఏరియా కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ దేశంలో మోడీ అధికారంలోకి వచ్చాక నల్లధనం మొత్తం బయటికి తీస్తానని ప్రతి కుటుంబానికి 15 లక్షల రూపాయలు జందన్ ఖాతా ద్వారా ఎకౌంట్లో వేస్తానన్నాడని,రెండోసారి అధికారంలోకి వచ్చాక నల్లధనం వెలికితీయ పోక దేశ సంపదను దోచుకున్న బడా పెట్టుబడిదారులకు కాపాడే ప్రయత్నం చేశాడని ఆరోపించారు.మతం పేరుతో కల్లోలాలు సృష్టించి దేశంలో హిందూ మతోన్మాదాన్ని అడ్డం పెట్టుకొని బిజెపి రాజకీయం చేస్తుంది అన్నారు .మూడోసారి జరిగిన ఎన్నికల్లో అయోధ్యలో రామ్ మందిరం అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు తిరస్కరించి అక్కడ బిజెపి అభ్యర్థిని ఓడించడం జరిగింది అని అన్నారు, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే ముందు ఆరు గారెంటీలు అమలు చేస్తానని వాగ్దానం చేసింది కానీ చేసిన ఏ ఒక్క వాగ్దానం పూర్తిగా అమలు చేయడంలో విఫలమైంది కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదు కులగరణ పేరుతో ప్రజల సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు .ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకురాలు మనీ రజిత మల్లమ్మ శోభ యశోద రాణి రమ పాల్గొన్నారు



# సంచార జాతి కులాలంటే ప్రభుత్వానికి ఎందుకు ఇంత చులకన?

## సర్వే ఫారంలో కాలం నంబర్ 45లో సంచార జాతి కులమా...? అనే ప్రశ్న ఎందుకు తొలిగించారు?

## తెలంగాణ రాష్ట్ర 13 సంచార జాతుల సంఘం అధ్యక్షులు:బైలు కమ్మర మోహన్ చవాన్

**శంకర్‌పల్లి: నవంబర్ 10: (డైలీ రిపోర్ట్):** సంచార జాతి కులాలంటే ప్రభుత్వానికి ఎందుకు ఇంత చులకన అని తెలంగాణ రాష్ట్ర 13 సంచార జాతుల సంఘం అధ్యక్షులు బైలు కమ్మర మోహన్ చవాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి అధికార యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. ఈ సర్వేలో మహిళనే గృహ యజమానిగా గౌరవిస్తూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల, రాజకీయాలకు సంబంధించిన వివిధ అంశాల్లో సమాచారాన్ని సేకరించనున్నారు. సంతోషకరమైన విషయం కానీ ఈ సర్వే ద్వారా సంచార జాతి కులాలకు అన్యాయం జరుగుతుంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించి, భవిష్యత్తు సంక్షేమ పథకాల రూపకల్పనలో ఉపయోపడే విధంగా ఉపయోగించుకోనున్నారు. అవసరమైన సమాచారం ఇవ్వాలని సర్వే సమయంలో ఆధార్ కార్డులు, భూమి వివరాలకు ధరణి పాస్ పుస్తకాలు, బ్యాంక్ ఖాతా దగ్గర ఉంచుకోవాలని ఈ సర్వే చాలా కీలకమని, ప్రతి కుటుంబం అందుబాటులో ఉండి సంబంధిత సమాచారాన్ని ఇవ్వాలని సర్వేకు వచ్చే వారికీ సహకరించాలని ప్రభుత్వం ప్రజలను కోరుతుంది. ఈ సర్వే ప్రజల అన్ని ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని పాలకులు, అధికారులు అందరు గంటాపదంగా ప్రచారం చేస్తూ ఉపన్యాసాలు ఇస్తున్నారు. కానీ ఈ రాష్ట్రములో ఉన్న సంచార జాతి కులాలు అంటే ఎందుకు ఇంత చులకనభావం చెప్పాలి ఈ ప్రభుత్వం. నిన్నటి వరకు సర్వే పారంలో కాలం నెంబర్ 45 లో సంచార జాతికి చెందిన వారా అని ప్రశ్న ఉంది అది నేడు 10/10/2024 రోజు తొలిగించబడింది ఎందుకు...?



**సంచార జాతి కులాల గూర్చి ఆ కులాలు వివరాలు ఇవ్వవద్దా..?**

సామాజిక అంశంలో %ఎ౩, ర్, ఎ౩% అని ఉంది, మరియు కులం పేరు ఉంది.అందులో సంచార జాతి కులం ఎవరో ఎలా తెలుస్తుంది.అందుకే కాలం 45 ప్రశ్న ఉండాలి.ఇది జాతీయ స్థాయిలో రేపు కేంద్ర ప్రభుత్వం సంచార కులాల లిస్టు అడిగితె క్లియర్ గా చెప్పడానికి ఈ కాలం నెంబర్ 45 లో నమోదు చేసిన కులాల లిస్టు ఇవ్వవచ్చు.కానీ ఆ కాలం ప్రస్తుతం తిలిగించడం జరిగింది. ఇది ఏ ఉద్దేశంతో చేశారు. ప్రస్తుతం ప్రభుత్వమునకు గాని, ప్రభుత్వ అధికారులుకు గాని ఈ సంచార జాతి కులాల గూర్చి ఇప్పటి వరకు 99% మందికి తెలియదు. అవి ఏ కులాలో ఒక సారి పరిశీలించండి. సామాజికంగా, రాజకీయంగా,విద్యాపరంగా, ఉద్యోగపరంగా ఇంకా అన్ని రంగాల్లో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల (ఎస్సీ, ఎస్టీ) కులాల కంటే ఈ సమాజంలో అతిగా వెనుకబడిన కులాలలో అద్వాన్న స్థితిలో బిసి ఏ గ్రూప్ ఉన్న నిరుపేద సంచార జాతి కులాలు తెలంగాణ రాష్ట్రములో ఉన్న సంచార జాతి కులాలు -52, ఎంబిసి కార్పొరేషన్ లోని కులాలు -35. అవి బాలసంతు, బహురూపి,బుడబుక్కల, దాసరి, దొమ్మర, గంగిరెద్దులవాళ్ళు, జంగంజోగి, మొండివాళ్ళు, మొండిపట్ట, మొండిబండ, వంశరాజ్, పాముల,పార్ధి, నక్కల, పంబాల, పెద్దమ్మల్లోళ్లు,వీరభద్రయ, గుడాల,కంజెరబట్ట, రెడ్డిక, నేక్కార్, పరికిముగ్గుల, యాట, చోపేమారి,కైకడి, జోషినంది వాళ,మందుల, కూనపులి,పత్ర, పాలఏకరి, రాజన్నల, గోత్రాల,బుక్క అయ్యవారు,కశికాపాడి, సిద్ధుల 2020 లో కొత్తగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం BC A లో చేర్చిన సంచార జాతి కులాలు -13. అవి పరంవారు, ఆద్దమువారు,బాగోతుల,బైలు కమ్మర /గిసాడి /గడియ లోహర్, ఏనుటి, గంజికూటివారుగౌడజేట్టి, కాకిపడగల,మాసాయ్యలు, ఓడ్,శ్రీశత్రియరామజోగి ,తేరాచీరాల, తోలుబొమ్మలాటవారు.ఫెడరేషన్స్ ఉన్న కులాలు -4 అవి వడ్డెర, పూసల, మేదరి, బోయ,బీసీ-ఈ గ్రూప్ లో ఉన్న పేద ముస్లిం కులాలు అచ్చుకట్లవాండ్లు, సింగలి, సింగంవాళ్లు, అచ్చుపనివాళ్లు అత్తరు సాయిబులు, అత్తరోళ్లు దోభీ ముస్లిం, ముస్లిమ్ రజకులు ఫకీరు, ఫకీరు బుడ్‌బుడ్కి, గంటా ఫకీర్లు, దర్వేష్ ఫకీర్ గారడీ సాయిబులు, పాముల వాళ్లు, కనికట్టు వాళ్లు గోసంగి ముస్లిమ్, పకీరు సాయిబులు ఎలుగుబంటు వాళ్లు, ముసల్మాన్ కీలుగుర్రల వాళ్లుహజమ్, నాయి ముస్లిమ్, నవీద్ లబ్బి, లబ్బాయి, లబ్బన్, లబ్బ పకీరియా, బోరెవాలె, డేరా ఫకీర్లు, బొంతే వాలే, ఖురేషి,ఖసబ్, మరాఠి ఖసబ్, ముస్లిం కటిక. షైక్, షేక్. సిద్ధి, యాబ, హబ్షి, జసి తురక కాశ, జింకసాయిబులు, చక్కిటకానెవాలె (రోళ్లకు కక్కు కొట్టేవారు), పట్టర్ పోడులు,

బిసి గ్రూప్ లో ఉన్న కులాలు దాదాపు 52 సంచార జాతి కులాలు ఉన్నాయి, అలాగే బీసీ ఈ గ్రూప్ లో 14 సంచార ముస్లిం కులాలు ఉన్నాయి. ఇవి డైరక్ట్ గా ఈ సర్వే ద్వారా ప్రభుత్వానికి సర్వే పారంలోని కాలం నెంబర్ 45 ద్వారా తెలుస్తుంది. కానీ ఇప్పుడు ఆ కాలం సర్వే పారం నుండి తొలిగించి సంచార జాతి కులాల ఉనికిని కనుమరుగు చేస్తున్నారు. ఈ విషయం ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు గమనించగలరని సంచార జాతి కులాల నాయకులు, ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రాజెక్ట్ లను అడ్డుకుంటే చరిత్ర హీనులవుతారు..





విపక్షాలకు సీఎం రేవంత్ హెచ్చరికలిపెండింగ్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం లిపాలమూరును సస్యశ్యామలం చేస్తాం నారాయణ్‌పేట్, :కొడంగల్ ప్రాజెక్టు పూర్తి చేసి త్వరలోనే మక్తల్, నాగర్‌కర్నూల్, కొడంగల్ ప్రాంతాలకు కృష్ణా జలాలను పారిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. “తెలంగాణ వచ్చి పదేళ్లవుతున్నా పాలమూరు నుంచి వలసలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు” అని ఆయన పేర్కొన్నారు.శ్రీ కురుమూర్తి వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి ఆదివారం స్వామి వారిని దర్శించుకున్నారు. దేవాలయంలో లక్ష్మీదేవి, భూదేవి అమ్మవార్లను కూడా దర్శించుకుని ఆశీర్వచనం తీసుకున్నారు. అంతకు ముందు శ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో రూ. 110 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ఘాట్ రోడ్డు, ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ఆలయ ప్రాశస్త్యాన్ని వివరించారు. దేవాలయ అభివృద్ధి కార్యక్రమాలకు అంచనాలు రూపొందించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పాలమూరు జిల్లా వలసలకు మారుపేరు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి కాలేదు. ప్రజా ప్రభుత్వ భగీరథ ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూడొద్దు అని ఆయన పేర్కొన్నారు. వలసల నిరోధించడానికి జిల్లాలో ప్రాజెక్టులను పూర్తి చేసి పాడి పంటలతో విలసిల్లేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ఈ జిల్లా బిడ్డగా సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే నన్ను చరిత్ర క్షమించదు. అడ్డుకోవాలని చూసే వారిని పాలమూరు జిల్లా ప్రజలు క్షమించరు. అలాంటివారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారు అని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో అమర్‌రాజా బ్యాటరీస్ కంపెనీలో 2 వేల మంది స్థానిక నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇవ్వడానికి కంపెనీ అంగీకరించిందన్నారు. ఈ ప్రాంతంలో ఏ కంపెనీలు వచ్చినా ఈ ప్రాంత నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత ప్రభుత్వానిదేనని తెలిపారు.జిల్లాలో గ్రామ గ్రామానికి, తండాలకు బీటీ రోడ్లు వేసే బాధ్యత తనదన్నారు..ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామన్నారు.ఈ పర్యటనలో ముఖ్యమంత్రి తో పాటు మంత్రులు దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కరీంనగర్ రాయితో నూతన హైకోర్టు నిర్మాణం

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే వెల్లడి**

**జిల్లా కోర్టు ఆవరణలో 12 కోర్టు భవనాల నిర్మాణానికి భూమిపూజ**

**జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించాలని సూచన**

కరీంనగర్ క్రైం: రాష్ట్ర నూతన హైకోర్టు నిర్మాణంలో కరీంనగర్ నుంచి తెప్పించిన బండను వాడుతున్నామని.. ఉమ్మడి కరీంనగర్ జిల్లా గొప్ప చరిత్ర కలదని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే తెలిపారు. కరీంనగర్ జిల్లా కోర్టు ఆవరణలో నిర్మించనున్న 12 నూతన కోర్టు భవనాల సముదాయానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. అలాగే సీతారాంపూర్ రోడ్డు లో జడ్జీల నూతన నివాస భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కో ర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించాలన్నారు. అందుకు న్యాయవాదులు సహకరించాలని సూచించారు. కేసుల విచారణలో అనవసర వాయిదాల ను నివారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కోర్టు పరిపాలనా జడ్జిగా వ్యవహరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మణ్‌తోపాటు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బి.వినోద్‌కుమార్, జస్టిస్ విజయసేన్‌రెడ్డి, జస్టిస్ ఎన్‌వీ శ్రవణ్‌కుమార్, జస్టిస్ ఈవీ వేణుగోపాల్, జస్టిస్ పుల్ల కార్తీక్, జస్టిస్ శ్రీనివాసరావు, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణకుమార్ మాట్లాడారు. అనంతరం కరీంనగర్ జిల్లాకు చెందిన హైకోర్టు రిటైర్డ్ జస్టిస్ పి.నవీన్‌రావుతోపాటు వృత్తిలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న



సీనియర్ న్యాయవాదులు పి.గోపాలకృష్ణ, కె.మాధవరావు, జి.నారాయణరెడ్డి, వి.వెంకటేశ్వరరావు, జి.హనుమంతరావును చీఫ్ జస్టిస్ సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీవీ రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బేతి మహేందర్‌రెడ్డి, న్యాయమూర్తులు, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ ఆర్డీవో మహేశ్వర్, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యే ముందు చీఫ్ జస్టిస్ సహా ఇతర న్యాయమూర్తులంతా మంకమ్మతోటలోని జస్టిస్ ఈవీ వేణుగోపాల్ నివాసంలో తేనీటి విందుకు హాజరయ్యారు.

# సెలవొచ్చిందంటే.. జంక్షన్లు జామ్..!

**కొన్ని కూడళ్లలో కనిపించని సిబ్బంది**

**ఇష్టానుసారంగా వాహనదారుల రాకపోకలు**



సిటీబ్యూరో: నగరంలో ట్రాఫిక్ రద్దీ ప్రతి నిత్యం ఉంటున్నది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు ఆయా ప్రధాన కూడళ్లలో తప్పనిసరిగా ఉండాలి. కానీ ఆదివారం వచ్చిందంటే చాలు.. సిగ్నల్స్ వద్ద సిబ్బంది కనిపించడం లేదు. చాలా సందర్భాల్లో ట్రాఫిక్ పోలీసులు తమ విధులు పక్కన పెట్టేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కేవలం రోజు వారీ చలాన్ల టార్గెట్లు పూర్తి చేసుకోవడం, తమ విధులు పూర్తయ్యాయనే భావనతో ఇంటి ముఖం పట్టడం చేస్తున్న వాళ్లు చాలా మందే ఉన్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అయితే ప్రతి నిత్యం ట్రాఫిక్ రద్దీ ఏర్పడడం, ట్రాఫిక్ సమస్యగా ఉండే కూడళ్ల వద్ద సిబ్బంది ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. అయితే ఆదివారం, ఇతర సెలవు దినాలు వచ్చాయంటే ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు అంతంత మాత్రంగానే పనిచేస్తున్నారు.ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఎంజే మార్కెట్, గాంధీభవన్, నాంపల్లి కూడళ్లన్నీ బిజీగా ఉన్నాయి. గాంధీభవన్ నుంచి నాంపల్లి జంక్షన్ దాటేందుకు సాధారణ సమయాల్లో ఒకటి రెండు నిమిషాల పట్టే సమయం ఆదివారం పది నుంచి పదిహేను నిమిషాలు పట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వెలగనప్పుడు తప్పనిసరిగా ఒక ట్రాఫిక్ సిబ్బంది అయినా ఉండాల్సింది. కానీ ఎవరూ లేకపోవడంతో ఎవరికీ వరే అన్నట్లు వాహనాలు వెళ్లడంతో ఇతర ప్రయాణికులు అవస్థలు పడాల్సి వచ్చింది.

# విదేశీ ఉద్యోగాల ముసుగులో మోసం

**సైబర్ నేరగాళ్ల వలకు చిక్కి..**


**కంబోడియాలో బందీ అవుతున్న యువత**

**బయటకు రావాలంటే.. ఇతరులను మోసం చేయాల్సిందే..**

**ఏజెంట్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఎర**

**కంబోడియా కాల్ సెంటర్లలో యువత విలవిల**

సిటీబ్యూరో, నవంబర్ 10 (నమస్తే తెలంగాణ): విదేశీ ఉద్యోగాల పేరుతో ఎర వేస్తున్న సైబర్ నేరగాళ్లు.. అమాయక నిరుద్యోగ యువతను మోసం చేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా యువతను కంబోడియాకు రప్పించుకుంటున్న సైబర్ నేరగాళ్లు.. తమ కాల్‌సెటర్లలో నియమించుకొని వారితోనే నేరాలు చేయిస్తున్నారు. కంబోడియా వెళ్లిన యువత తిరిగి స్వదేశానికి వచ్చేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. అక్కడికి వెళ్లిన యువత.. తిరిగి స్వదేశానికి రావాలంటే నేరగాళ్లు షరతులు విధిస్తున్నారు. స్వదేశం నుంచి కొత్తవారిని రప్పించాలని.. అప్పుడే అక్కడున్న వారిని విడుదల చేస్తామంటున్నారు. మీరు మీ దేశాలకు వెళ్లిపోతే.. ఇక్కడ పని ఎవరు చేస్తారు.. అంటూ బెదిరిస్తున్నారు. లేదంటే పోలీసులు, కేసుల పేరుతో భయపెడుతున్నారు. దీంతో యువత అక్కడే బందీలవుతున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల వెలుగు చూస్తున్నాయి.ఇంత కాలం ఆయా దేశాల్లో కాల్‌సెంటర్లు నిర్వహించిన సైబర్ నేరగాళ్లు.. ఆ రాష్ట్రాల్లో పోలీసు నిఘా పెరగడంతో రూట్ మార్చుకున్నారు. తాజాగా.. వారి వారి దేశాల్లోనే కాల్‌సెంటర్లు ఏర్పాటు చేస్తూ.. అక్కడి నుంచే నేరాలు మొదలు పెడుతున్నారు. ఇందుకు ఆయా దేశాల్లో తమ ఏజెంట్లను నియమించుకుంటున్నారు. వారి సహాయంతో.. విదేశాల ఉద్యోగాల వేటలో ఉన్న నిరుద్యోగులను ఆకర్శిస్తున్నారు. యువతను వారి వారి దేశాలకు రప్పించుకుంటూ.. వారు నేరాల కోసం ఏర్పాటు చేసుకున్న కాల్ సెంటర్లలో ఉద్యోగాలిస్తున్నారు.




## సింగాపురం మరకత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్

**శంకర్‌పల్లి నవంబర్ 10:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి పదవ వార్డు సింగాపురంలో నూతనంగా నిర్మించిన మరకత ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఆదివారం రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు జ్యోతి భీమ్ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం జ్యోతి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు జ్యోతిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జ్యోతి భీమ్ భరత్ మాట్లాడుతూ ఆంజనేయస్వామి ఆశీస్సులు పట్టణ వార్డు ప్రజలపై ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# ఒకరి ఇంటికి మరొకరి ఇంటి స్టిక్కర్ అంటించిన సర్వే సిబ్బంది.

**అవగాహన లేని సిబ్బందికి పని అప్పగించిన అధికారులు**




**డైలీ రిపోర్ట్(సంగారెడ్డి ):** ఉన్నత అధికారుల పర్యవేక్షణ లోపం కారణంతో ఎంతమంది కుటుంబ ల వివరాలు తప్పులు దొర్లు త్యోనని ప్రజల ఆందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే సంగారెడ్డి పట్టణం లోని 34 వార్డు డ్రైవర్స్ కాలనీ లో ఇంటి నెంబర్ 4-6-120/1 ఇంటి యజమాని పేరు ఎస్ యాదమ్మ కాగా అట్టి ఇంటికి ఇంటి నెంబర్ 4-6-121/1 ఇంటి యజమాని పేరు సుదర్శన్ అనే పేరుతో స్టిక్కర్ అంటించిన సర్వే సిబ్బంది.క్షేత్ర స్థాయిలో సిబ్బంది చేసే పొరపాట్ల వల్ల సర్వే తప్పుడు వివరాలు నమోదు అయ్యి అర్హులైన లబ్ధిదారులు నష్ట పోతే ఎవరు బాధ్యత తీసుకుంటారని. ఇంటి యజమాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి కైనా సర్వే పై అవగాహనాన ఉన్న,శిక్షణ పొందిన సిబ్బందిని సర్వే కోసం నియమించి సరైన సమాచారం సేకరించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# 18 నుంచి వ్యవసాయ కోర్సులకు మూడో దశ కౌన్సెలింగ్

హైదరాబాద్/ఏజీవర్సిటీ: వ్యవసాయ, ఉద్యాన కోర్సుల్లో రెగ్యులర్ కోటా సీట్ల ఖాళీల భర్తీ కోసం ఈనెల 18వ తేదీ నుంచి మూడో దశ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు వ్యవసాయ వర్సిటీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వ్యవసాయ, ఉద్యాన డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం జరుగుతున్న స్పెషల్ కోటా మొదటి దశ కౌన్సెలింగ్ ఆదివారంతో పూర్తయింది. రెండు దశల్లో జరిగిన రెగ్యులర్ కోటా కౌన్సెలింగ్, అలాగే ఆదివారంతో పూర్తయిన మొదటి దశ స్పెషల్ కోటా కౌన్సెలింగ్ తర్వాత వ్యవసాయ, అనుబంధ కోర్సుల్లో సుమారు 213 ఖాళీలు ఏర్పడినట్లు జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డి.శివాజీ తెలిపారు. బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్‌లో 80, బీవీఎస్సీ - 08, బీఎస్సీ (హానర్స్) హార్టికల్చర్ - 70, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ - 40, బీటెక్ ఫుడ్ టెక్నాలజీలో 15 సీట్లు ఖాళీగా ఉన్నట్టు వివరించారు. 18 నుంచి జరిగే మూడో దశ కౌన్సెలింగ్ ద్వారా ఈ కోర్సులలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. మూడో దశ కౌన్సెలింగ్ షెడ్యూలు, కోర్సుల్లో ఖాళీలు తదితర వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.pjtau.edu.in లో పొందవచ్చని ఆయన వివరించారు. మెరిట్ ఆధారంగానే సీట్లను భర్తీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707